
# ది ఎలెవెన్ కాజెస్ ఫర్ ది డీజెనరేషన్ ఆఫ్ టెలుగూ సినిమా




అట్టే అట్టే కదలకండి అలాగే నిలబడిపొండి .... ఏ అదిలా .... అలా ఇటు కేసి వోరకంట చూడండి .... శభాష్! సింప్లీ వండర్‌ఫుల్. అచ్చు బైస్కోపులో అమ్మళ్ళాగే ఉన్నారు. వెంకటేశం! ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యువర్ సిస్టర్. చూడవోయ్ గార్బో, గాడర్డ్, డీట్రిక్ వీళ్లంతా ఎందుకు పనికొస్తా రీ రూరల్ బ్యూటీ ముందు--కాంట్రాష్టు చూపెట్టడానిగ్గాకా? అసలు వాళ్లకిలా ఈపట్టిన ఇంత అతి లోక సుందరి రాటవుతున్న ఆచూకీ తెలిస్తే మరో మరో మామ్మతో బైస్కోపు తీదురా అని. నో వుయ్ కాంట్--మిస్ బుచ్చమ్మ రాక పోతే మా కివన్నీ అనవసరం అని మానేద్దురు. అందుకే కదోయ్ నాలాంటి వాడింకా ఫీల్డు లోకి జంప్ చెయ్యకుండా ఉన్నది.

ఎవడో ఒహ గుంటడూ, ఒహ గుంటదీ జతపడితే చాల్నని ఎగబడి పిక్చర్లు తీసేదామని ముందుకు దూకేసే వాళ్ళున్నందు వల్లనే గదటోయ్ ఈనాడు మరీ ఇంత గుంటతనప్పిక్చర్లు వొచ్చి పడి పోతున్నాయి -

ఈ విషయవై, రీసెంటుగా ఇంటర్ నేషనల్ ఫిలిం సెమినార్‌లో 'ది ఇలెవెన్ కాజెస్ ఫర్ ది డీజెనరేషన్ ఆఫ్ టెలుగూ సినిమా' అన్న సబ్జెక్టుమీద ఒక్క బిగిన నాలుగు ఘంటలెక్కురిచ్చే సరికి అక్కడున్న యావన్మందిన్నీ డంగై పోయారు. మళ్ళీ వాళ్ళని

---

గిరీశం లెక్చర్లు

మేల్కొలపడానికి స్మెల్లింగ్ సాల్టు గట్రా పెట్టి నానాతంటాలూ పడవల్సొచ్చింది.

యస్. అసలే వెహిమెంట్ లెక్చర్--అసల్లెక్చరంటే నాకింక వొళ్ళు పై తెలీదు. మహ నిర్దాక్షిణ్యంగా యనలైజ్ చేసి ఈక్కి ఈకా తోక్కి తోకా పీకి ఏకవతల పారేస్తాను. అఫ్‌కోర్స్, .... ఐనో ఐనో ..... నాకు తెలుసు. చించుకుంటే కాళ్ళ మీద పడేనని, బట్ వాట్టుడూ? ..... డ్యూటీ ఫస్టన్నారు మరి.

చెప్పొచ్చిన మాట. మరి ఆనాడలా ఢంకా బజాయించి లెక్చరిచ్చేసరికి మీటింగులో పోగైన యావన్మందిన్నీ విరగబడి పోయి 'గిరీశం డూ మీ యే పిక్చరంటే డూ మీ యే పిక్చర'ని కాళ్ళా వేళ్ళా బడ్డారంటే నమ్ము. నే నొప్పుకుంటానా. ఛస్. వల్ల కాదు పొమ్మన్నా. మదరిండియాలోని ఓ మారుమూల కుగ్రామంలో వరల్డ్ బ్యూటీ ఒకటి రాటవుతోందోయ్ వాజమ్మల్లారా--ఆవిడని ఎక్స్‌ప్లాయిట్ చేస్తూ మాదోహ తెలుగూ బయస్కోపు తీస్తేగాని మరొహటి--మీరు నిలువెత్తు ధనం పోసి నప్పటికిన్నీ యెడమ చేత్తో కూడా ముట్టనోయ్ అని చెప్పేశాను .... బ్యూటీ ఫస్టన్నారు మరి.

పోనీ అయితే ఆవిణ్ణే హీరోయినుగా వేసుకొని తీసి పెట్టండి సార్ అని వాళ్ళంతా పాపం ప్రాధేయపడ్డారు. బట్ నో .... బుచ్చమ్మా ఈజ్ బ్యూటిఫుల్ తెలుగు గర్ల్, పైగా విడో కూడా. ఎప్పుడూ మడీ మడీ అంటూ ఇదవుతుంది. తెలుగు తప్ప మరొహభాష ఛస్తే మాటాడదు అని చెప్పాను.

మహబాగలాగే కానీండి. ఆవిడ కసలు డైలాగే లేకుండా పిక్చరు తీదురుగానని బతిమాలారోయ్. ఆ మాటా రైటే.

ది బర్నింగ్ ప్రోబ్లెం ఆఫ్ ఆల్ టైమ్స్--విడో మారియేజ్ మీద ఫస్టు పిక్చరు లాగవతల పారెయ్యొచ్చు ననిపించింది..... ఎవరూ కరటక శాస్త్రులవారా? దయ చెయ్యండి, మీమాటే అనుకొంటున్నాం.

అబ్బే విడో మారేజస్--అనగా వితంతూద్వాహములు అను విషయమై ఒక పిక్చరు తీయమని హాలీవుడ్ దొరల కంపినీ ఆఫరు పంపింది -- టెన్ థౌజండ్ డాలర్లమీద, డాలరంటే వరహా అన్నమాట. చూశారా వాళ్ళేదో మహ ముందుకు పోయారను

కుంటున్నాము. మనం వరహాలు వదలి రూపాయిల్లెక్కలోబడి ఇంతకాలమాయె గాని వాళ్ళింకా వరహా వరహా అంటూనే పాకులాడుతున్నారు. విడో మారేజనూ అంతే. అక్కడా ఉంది ఈ ప్రాబ్లెము. బ్యూటిఫుల్ యంగ్ విడోస్‌ని చూసి గుండె తరుక్కుపోయి ఘొల్లున ఏడిసేవాళ్ళు అక్కడా ఉన్నారు. అక్కడేమిటి యెక్కడపడితే అక్కడే ఉన్నారు. ఇందుగల రందులేరని సందేహము వలదు .... నాచ్చి కొశ్చన్‌లాగే ఇదిన్నీ, యూనివర్సల్ ప్రాబ్లెమ్, అల్ టైమ్ ప్రాబ్లెమ్, విడోని పెళ్ళి చేసుకోడం యెప్పుడూ మానవుడికి ప్రాబ్లెమే గాదండీ . .... అందికే నేనీ సబ్జెక్ట్ తీస్కున్నాను మన పిక్చర్‌కి. దీన్ని ముందు మన మాతృభాషలో తీసి ఆ మీదట, మీదటికో పైయేటికో వరల్డు లాంగ్వేజస్ అన్నిటిలోకి డబ్ చేసి అవతల పారేస్తే ఇహ మీరు అప్పుడొచ్చిపడే వరహాలు దాచుకునిందికి అగ్గురారం భూవులన్నిటా మహాళ్ళు కట్టించీయాల్సిందే మరి--

అందికే నేను అహోరాత్రులు మొత్తుకుంటున్నాను. తమరు పాటిమట్టి దిబ్బలు రొండు తవ్వించి ప్రస్తుతానిక్కాస్త రొఖ్కం గాదాయించి విసిరేస్తే దాన్ని నేను మళ్ళీ లక్షల్లోకి తర్జుమా చేసి దాఖలు చేసుకుంటానని.

మట్టిని బంగారం చేస్తానన్నాడు వెనకటి కెవడో .... మట్టి ఓ పట్టాన బంగారమవుతుందండీ దాం దుంపతెగ--అందులో ఏ గిరీశం జీనియస్సో, ఏ కరటక శాస్త్రులుగారి సహృదయమో కల్తీ అయితే తప్ప. యిదిగో యిలాగే మార్చుకోవాలి మరి, వెధవది యెన్నాళ్ళు దున్ని దున్ని వడ్లమ్మి పోగేస్తే అయినట్టుటా--మరదే ఓ పిక్చరు తీసి పారేశాన్పూడండి, యిహ చాలు బాబోయ్ అని మొత్తుకునేదాకా వస్తూనే ఉంటుంది.

ఇదిగో ఈ ధర్మసూక్ష్మం మా బావగారికి యెన్నిసార్లు చెప్పబోయినా చెవిన బెట్టారు కాదు, ధువఁధువఁ లాడుతూ లేచ్చక్కాపోడవేఁ గాని. మీ రైనా సహృదయులూ, సరసులూ, నికార్సైన విలువలు తెలిసిన వారున్నూ గాబట్టే ఇందులో స్వారస్యం లాభం పసిగట్టారు **మరొహాళ్ళకైతే** పురం వేఁసినా పట్టుబడుతుందంటారా? మీరే చెప్పండి. నేన్చెబితే అడుగో గిరీశంగాడు ముఖస్తుతి చేశాడేమిటి చెప్మా ఎన్నడూ లేనిదీ--అనుకుంటారు. మీరే చెప్పండి...నా ఉద్యమంలో ప్రాశస్త్యం మీ క్కొరుకుడు బడ్డట్టు మరొహ వానరమానవుడికైనా అని .... నిన్న చెప్పినట్టు మీరు, వారు ఆలోచించుకొని ముందర సాదర ఖర్చులకీ,

కంపెనీ బిగినింగుకీ కొంత రొఖ్ఖం జతపరిస్తే నేనూ, వెంకటేశం స్క్రీప్టు మీద కూచుంటాం. అంతే, ఆనక మీరిస్తానన్నా ముట్టుకోం. కాండబ్బు కూడా కదపొద్దు, కదిపితే నా మీదొట్టు.డిస్ట్రిబ్యూటర్లే లారీలమీద తోలించుకొస్తారండీ డబ్బు. అన్నట్టు మర్చిపోయా. వెధవది నేనీ మారుమూల విలేజిలో యిలా ఆలోచన చేస్తున్నట్లపుడే పాక్కి పోయింది దేశమంతా. అప్పుడే న్యూస్ పేపరువాళ్ళు పబ్లిసిటీ ఆరంభం చేశారు. చిత్తగించండి .... అరే వెళ్ళి పోతున్నారేం?

డామిట్, మరీ ఇడియట్‌లాగున్నాడే మీ మావ! వెంకటేశం నోట్‌బుక్ తీసి రాసుకో..... రాసుకో చెప్తా. ది ఇలెవెన్ కాజెస్ ఫర్ ది డిజెనరేషన్ ఆఫ్ తెలుగూ సినిమాలో పదకొండున్నూ ..... వన్, టూ, త్రీ, ఫోర్, ఫైవ్, సిక్స్, సెవెన్, యెయిట్, నైన్, టెన్-- అండ్ దెన్ నెంబర్ ఇలెవెన్. . . . ఏవైతేనేంలే, ఇప్పటి కిది చాలు.

ఆర్టిస్టు మూడ్ ఫీడ్ చేయడానికి డబ్బు తొరగా ఇవ్వకపోవడం మోస్టింపార్టెంట్ రీజన్ అని--

అరె! మిస్ బుచ్చమ్మకూడా చక్కా పోతోందే--శాడ్‌సీన్‌లో హీరోయిన్‌లా ఫేసు పెట్టీ.

డామిట్, ఒక్క దెబ్బకి రెండు పిట్టలెగిరిపోయాయి!

